క్లుప్తంగా

కోలా గురువులుకు అభినందనలు



కోలా గురువులును అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మహారాణిపేట : డీసీసీబీ చైర్మన్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోలా గురువులును శుక్రవారం పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. కార్మిక నాయకుడు మంత్రి రాజశేఖర్, మాజీ కార్పొరేటర్లు బొడిలపాటి ఉమామహేశ్వరరావు, కొప్పల వెంకటరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు వంకాయల మారుతీప్రసాద్, ఏపీ జూనియర్ ఆర్టిస్టుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రమ్మ, కేజీహెచ్ వైఎస్సార్ టీయూసి నాయకుడు నీలాపు శ్రీనివాసరావు తదితరులు గురువులును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

అల్లిపురం : వెంకటేశ్వరమెట్ట, శ్రీ వెంకట గౌరీశంకర గ్రంథాలయం ఆవరణలో శుక్రవారం మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కొబ్బరితోట పీహెచ్‌సీ పరిధి వెంకటేశ్వరమెట్టపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో గతంలో టీకాలు వేసుకోని వారిని గుర్తించి ఏఎన్‌ఎం మదీనమ్మ, ఆశ వర్కర్ అనురాధ ఇంటింటికీ వెళ్లి టీకాలు వేశారు.

దివ్యాంగులకు రేషన్ అందజేత



దివ్యాంగులకు రేషన్ అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన గల మదర్ థెరిసా ఫర్ డెఫ్ రీచ్ సొసైటీ ప్రతినిధులు శుక్రవారం ఐదుగురు దివ్యాంగులకు 25 కేజీల చొప్పున రైస్‌బ్యాగ్‌లు, బి. లలిత, శంకర్‌కృష్ణకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి నాగులపాటి సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఉచితంగా మందుల పంపిణీ



కార్యకర్తకు మందులు ఇస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

జగదాంబ : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగ ఉంటామని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. వార్డులో చాలా మంది షుగర్, బీపీ, క్యాన్సర్ వంటి వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారందరికీ ప్రతినెల మందులు సొంత నిధులతో కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నామన్నారు. పార్టీలోను, వార్డులోను ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే తనను సంప్రదించాలని సాధిక్ తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలియజేశారు. అనంతరం పలువురికి ఈనెలకు సంబంధించిన మందులను కార్యకర్తలతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడి.. వసతులు రెడీ

నాడు–నేడు కార్యక్రమం ద్వారా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. అనేక వసతులు కల్పిస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణం కోసం పాఠశాలల ఆవరణలను పచ్చదనంతో నింపుతున్నారు. చక్కటి చదువుల కోసం నిపుణులైన టీచర్లను నియమిస్తున్నారు. దీంతో ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పించని తల్లిదండ్రులు సైతం ఇప్పుడు సర్కార్ బడుల్లో తమ పిల్లలకు సీట్ల కోసం క్యూ కడుతున్నారు.



న్యూమార్కెట్ స్ట్రీట్ జీవీఎంసీ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు



మున్సిపల్ స్టేడియం జీవీఎంసీ పాఠశాలలో నిర్మిస్తున్న భోజనాల గది

- రూ.2 కోట్ల వ్యయంతో అదనపు తరగతి గదులు, బాత్‌రూమ్‌లు, వంట గదులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం
- అభివృద్ధిపథంలో మున్సిపల్ స్టేడియం పాఠశాల, న్యూ మార్కెట్ పాఠశాల



వెస్ట్రన్ స్టైల్ మరుగుదొడ్ల నిర్మాణం

జగదాంబ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. నాడు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ ఇవ్వడంతో ఈ రోజు ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు డాక్టర్లుగా, ఇంజినీర్లుగా దేశ, విదేశాల్లో సత్తా చాటుతున్నారు. అలాగే ఇప్పుడు జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలకు కొత్తరూపు ఇస్తున్నారు. అదనపు తరగతి గదులు, వంటశాలలు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటి వసతులు కలిప్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలను చూస్తే అవి కార్పొరేట్ హంగులతో అలరారుతున్నాయి.

రూ. 2 కోట్లతో పాఠశాలలకు అదనపు వసతులు

జీవీఎంసీ 35వ వార్డులో ఉన్న గణేశ్వర జీవీఎంసీ పాఠశాల, మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న న్యూ మార్కెట్ జీవీఎంసీ పాఠశాలను రూ. 2 కోట్లు వెచ్చించి ఆధునికీకరిస్తున్నారు. అదనపు తరగతి గదులు, టైల్స్, మరుగుదొడ్లు, వంట గదులు, డైనింగ్ హాళ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు కలిప్తున్నారు. ఆహ్లాదకర వాతావరణం కోసం మొక్కలు నాటుతున్నారు. దీని వలన పాతనగర వాసులు ఎవరికీ తమ పిల్లల్ని ప్రైవేట్ స్కూళ్లలో చేర్పించలేదనే బాధ లేకుండా పోయింది.

పాఠశాలలు బాగున్నాయి..



జగనన్న విద్య కోసం ఎంతో చేస్తున్నారు. ఆయన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మార్చేసారు. గతంలో మా పిల్లల్ని ప్రభుత్వ బడికి పంపిచే వాళ్లం కాదు. ఇప్పుడు ఆ పాఠశాలలు చాలా బాగున్నాయి. చక్కటి వసతులతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వ బడులను చూస్తే ఆనందం కలుగుతుంది.

లావణ్య, విద్యార్థి తల్లి,
ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు.

జగనన్న పేదవాళ్ల ఆశలు తీర్చారు..



ప్రభుత్వ పాఠశాలలను చక్కగా తీర్చిదిద్దడంతో పాటు పిల్లలకు కావల్సిన వసతులు, అందజేస్తున్న సౌకర్యాలు అభినందించదగ్గవి. ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలు, షూస్‌తో పాటు బడికి వెళ్లే పిల్లలకి ఏం కావాలో అవన్నీ అందజేస్తున్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పిల్లల చదువులు అయిపోతున్నాయి.

వనమ పైడమ్మ,
విద్యార్థి తల్లి, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి..

రాష్ట్రంలో ప్రతి ఒక్కరు చదువుకోవాలన్న ధ్యేయంతో జగనన్న పని చేస్తున్నారు. పేదరికంతో ఎవరూ బడి బయట ఉండకూడదు. ప్రైవేటు బడుల్లో చదివించలేకపోయాం అనే బాధ తల్లిదండ్రులకు ఉండకూడదు. అన్ని హంగులతో ప్రభుత్వ పాఠశాలలను జగనన్న అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు సీఎం జగన్ వెనుకడుగు వేయకుండా ఖర్చు చేస్తున్నారు.

–విల్లూరి భాస్కరరావు,
35వవార్డు కార్పొరేటర్.

ఫైనాన్స్ సంస్థల వేధింపులు ఆపాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విశాఖ డ్రైవర్స్ యూనియన్ నాయకులు

సీతమ్మధార : కోవిడ్ సమయంలో ఇచ్చిన మారటోరియంను రెట్టింపు వసూలు చేస్తున్న కంపెనీలపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విశాఖ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖ డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ మారిటోరియంకు (ఆరు వాయిదాలు) చివర్లో కట్టే విధంగా అవకాశం ఇచ్చారని, ఇప్పుడు రెట్టింపు వాయిదాలు కట్టమని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు వేధిస్తున్నాయని అన్నారు. కార్లకు ఫైనాన్స్ ఇచ్చిన కొన్ని సంస్థలు ఒక వాయిదాకి రెండు వాయిదాలుగా వసూలు చేస్తున్నాయని అన్నారు. ఒక వ్యక్తి ఐదు నెలలు ఈఎంఐ కట్టకపోతే ఇప్పుడు పది ఈఎంఐలు కట్టమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ క్యాబ్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ శ్రీ నివాస్, కె.పోలునాయుడు, కమిటీ మెంబర్లు శరత్, నాయుడు, కృష్ణ, మనోహర్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ బస్‌స్టేషన్ పార్సిల్ కౌంటర్ పరిశీలన



పార్సిల్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ ఆర్టీసీ బస్ స్టేషన్‌లోని పార్సిల్ కౌంటర్ పాయింట్‌ను శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఆపరేషన్స్ అండ్ కమర్షియల్ బి.అప్పలనాయుడు ఆకస్మికంగా పరిశీలించారు. ఏటీపీ పార్సిల్ సర్వీసులను పర్యవేక్షించారు. వినియోగదారులకు అందిస్తున్న సేవలను, పార్సిళ్ల చేరవేతకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్సిల్స్ చేరవేతలో వినియోగదారులకు నమ్మకమైన, వేగవంతమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఎంవీపీ బస్‌స్టేషన్‌లోని పార్సిల్ కేంద్రాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ఏమూలకైనా ఇక్కడి నుంచి సర్వీసులు అందుబాటులో ఉన్నాయన్నారు. సూపర్ వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌వి జ్ఞానం లేని మాటలు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ : ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ జ్ఞానం లేని మాటలు మాట్లాడుతున్నారని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. శుక్రవారం ఆయన వార్డు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇక్కడికి వచ్చి పవన్ కల్యాణ్ తనకు ఓటు వేసిన గాజువాక ప్రజల గురించి కానీ, స్టీల్‌ప్లాంట్ గురించి కానీ మాట్లాడకపోవడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి కావాలన్న కోరిక బలంగా ఉంది కానీ ప్రజల బాగోగులపై శ్రద్ధ లేదన్నారు. కరోనా సమయంలో ఆయన ఎక్కడున్నారని ప్రశ్నించారు. వైజాగ్‌లో ఇబ్బంది పెట్టారని చెబుతున్నారని.. ఇబ్బంది పెడితే ఆయన ఎలా మీటింగ్ పెట్టారని ప్రశ్నించారు. పదో తరగతి కూడా పాస్ కానీ ఆయన ఆంధ్రా యునివర్సిటీ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



మొదటి ర్యాంకర్‌ను అభినందిస్తున్న దృశ్యం

దాబాగార్డెన్స్ : ఏయూ ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌తో పాటు డిగ్రీ ఫలితాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల డాబాగార్డెన్స్‌కు చెందిన బీబీఏ బ్రాంచ్ విద్యార్థిని ఎస్. హారిక మొదటి ర్యాంకు కైవసం చేసుకుంది. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆదిత్య కళాశాలల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, డిగ్రీ, పీజీ కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎస్. సుగుణరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. కిషోర్ అభినందనలు తెలిపారు. మొదటి ర్యాంకు సాధించిన బీబీఏ బ్రాంచ్ విద్యార్థిని హారికను ఈ సందర్భంగా సత్కరించారు.

నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

అల్లిపురం : రాష్ట్ర ప్రభుత్వం నూతన జాబ్ క్యాలెండర్ తక్షణమే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య, విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 107, 108లను రద్దు చేయాలన్నారు. గ్రూప్–1, గ్రూప్–2, మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, ఉత్తరాంధ్ర ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అచ్యుత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయాల్లో నా భూమి–నా దేశం



జోన్–4లో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

దాబాగార్డెన్స్ : నా భూమి–నా దేశం–నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమం శుక్రవారం జీవీఎంసీ పరిధి అన్ని జోనల్ కార్యాలయాల్లో ఆయా జోనల్ కమిషనర్ల నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేపట్టారు. జోనల్ కమిషనర్లు, జీవీఎంసీ సిబ్బంది, పలు వార్డుల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు ప్రత్యేక సేవలందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : హెచ్ఐవీతో జీవిస్తున్న పిల్లలు, గర్భిణులకు ప్రత్యేక సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు జిల్లాల సిబ్బందితో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్ఐవీ బాధితులకు ఎలా సేవ చేయాలన్న దానిపై సిబ్బందికి శిక్షణ కూడా ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ క్రిస్టఫర్, డాక్టర్ ప్రభు, మేనేజర్ శైలజ, సూపర్‌వైజర్ భద్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



ధర్మకర్తల మండలి సభ్యులతో ఎమ్మెల్యే గణేష్‌కుమార్

సీతమ్మధార : దేవదాయ శాఖ, ధార్మిక పరిషత్ ఉత్తర్వుల మేరకు శుక్రవారం జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని పరదేశమ్మ అమ్మవారి ఆలయం, రామాలయం దేవస్థానాల నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ఈవో రమాబాయి ధర్మకర్తల మండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. మండలి చైర్మన్‌గా పాలికల సోమినాయుడును సభ్యులందరు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా గనివాడ విమలకుమారి, చిల్లా మంగదేవి, చిట్టిబోయిన శివ శంకర్‌కుమార్, సింహాద్రి లక్ష్మి, అంగటి కుమారి, గంట్యాడ రామారావు, ఎక్స్ అఫిషియో మెంబర్ గా అర్చకులు పి.సుబ్రహ్మణ్యం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి సభ్యుందరిని అభినందించారు. సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ దేవాలయ అభివృద్ధికి దోడ్పడాలన్నారు. ప్రభుత్వానికి, దేవాలయానికి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, డైరెక్టర్లు పద్మనాభం అమ్మాజీ, సకలాభక్తుల ప్రసాదరావు, జేసీఎస్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, ఆంజనేయస్వామి ఆలయం చైర్మన్ వడ్డాది దిలీప్‌కుమార్, సింహాచలం దేవస్థానం ట్రస్టీ సంపంగి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అజయ్‌రెడ్డి, అప్పలరెడ్డి, మధురెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత



33వ వార్డులో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్న ఆశ వర్కర్లు

అల్లిపురం : సీజనల్ వ్యాధుల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ క్లినిక్ పరిధిలో ఆశ వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే–డ్రైడే అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వార్డులోని వెంకటేశ్వరమెట్ట, మిరపకాయలవీధి తదితర ప్రాంతాల్లో డెంగీ, మలేరియా, అతిసార వంటి వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డ్రమ్ములు, నీలకుండీలు వారంలో ఒకరోజు ఆరనివ్వాలని తెలిపారు. తద్వారా దోమల నివారణ సాధ్యమై వ్యాధులు దరి చేరవన్నారు. ఇంటి ఆవరణలో వాడేసిన కొబ్బరిబొండాలు, పాత టైర్లు లేకుండా చూసుకోవాలన్నారు. దోమ లార్వాలు మంచినీటిలోనే వృద్ధి చెందుతాయని తెలిపారు. మనీప్లాంట్స్ తొట్టిల్లో నీటిని ఎప్పటికప్పుడు మార్చుకోవాలని సూచించారు.



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

39వ వార్డులో..

జగదాంబ : సీజనల్ వ్యాధులు ప్రబలే కాలాన్ని దృష్టిలో పెట్టుకుని నివాసాల సమీపంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ తెలిపారు. శుక్రవారం వార్డులోని రామకృష్ణానగర్‌లో డెంగ్యూ, మలేరియా వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నీటి కుండీలు, ఇతర పాత్రలపై మూతలు పెట్టుకోవాలని తెలిపారు. నిల్వ ఉన్న నీటిని పారబోసి పాత్రలను ఆర వేయాలన్నారు. ఇంట్లోని ఫ్రిజ్‌ల వెనుక శుభ్రం చేసుకోవాలన్నారు. పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియ నివారణ విభాగం అధికారులు, వార్డు ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి



బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం : జీవీఎంసీ 41 వార్డు జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిలో జరుగుతున్న బీటీ రహదారుల నిర్మాణ పనులను శుక్రవారం వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ కోడిగుడ్ల పూర్ణిమ పరిశీలించారు. నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ నెల 15న జరిగే దేవమాత ఉత్సవాలకు రహదారులను సుందరంగా అలంకరించాలని అధికారులను కోరారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ రహదారి నుంచి కాన్వెంట్ కూడలి, అటు జ్ఞానాపురం రైల్వేస్టేషన్ నుంచి ఎఫ్‌సీఐ గిడ్డంగి రహదారుల్లో సుమారు రూ.40 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు జోన్–5 ఇంజినీరింగ్ ఈఈ ప్రసన్నరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వేళంగిణీరావు, పబ్లిక్ వర్క్స్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిగ్ డేటా అనలిటిక్స్‌లో విద్యార్థినులకు శిక్షణ



సర్టిఫికెట్లతో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహానంద ఫౌండేషన్ సహకారంతో ఆ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, జవహర్ నాలెడ్జి సెంటర్ సంయుక్తంగా 70 మంది విద్యార్థినులకు 180 గంటల పాటు బిగ్ డేటా అనలిటిక్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సహకారంతో శ్యాంసంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ఈ శిక్షణను స్పాన్సర్ చేసింది. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్లు, కిట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. మహానంద ఫౌండేషన్ అధినేత కేఎస్‌బీ కిషోర్‌కుమార్ డేటా అనలిటిక్స్, బిగ్ డేటా టెక్నాలజీస్‌లో అందుబాటులో ఉన్న ఉద్యోగావకాశాల గురించి విద్యార్థినులకు తెలియజేశారు. డేటాప్రో సీనియర్ ఫ్యాకల్టీ ఎల్. విజయ్ ఇంటర్వ్యూల్లో సాంకేతిక రౌండ్ల సమయంలో ఎలా నైపుణ్యం ప్రదర్శించాలో వివరించారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ లెక్చరర్, జేకేసీ కో ఆర్డినేటర్ ఇన్‌చార్జి డి. అరుణపద్మ విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో లెక్చరర్ పద్మకుమారి, జేకేసీ మెంటార్లు వీఎస్ రాజు, టి. స్వప్న, డేటా సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



ముస్లిం ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం జీవీఎంసీ 36వ వార్డు పరిధి ఏవీఎన్ కళాశాల సమీపాన జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న 17 మంది రోగి మిత్ర, టెక్నీషియన్లు తమ జీతాలు నిలిచిపోయాయని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడారు. వారికి న్యాయం చేయాలని కోరారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి హామీపత్రాలు ఇచ్చినప్పటికీ అనివార్య కారణాల వల్ల ఇళ్ల స్థలాలు రాని వారికి ఎస్ఎన్ పురంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, మిగిలిన వారికి మూడవ దఫాలో మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్‌తో మాట్లాడారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని పలువురు నిరుద్యోగులు వినతి పత్రాలు అందజేశారు. పార్టీ కార్యకర్తల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీ ఇచ్చేలా చూడాలని పలువురు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముస్లిం ప్రజాదర్బార్ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దశమంతుల మాణిక్యాలరావు, బుద్దల అనురాధ, మీసాల అశోక్ కుమార్, ముజీబ్‌ఖాన్, బాబ్జి, రఫీ, ముస్తఫా, ఆదివిష్ణు, బొగ్గు శ్యామ్, బోని దేవా, వడ్డాది దిలీప్, దూడ అప్పారావు, వెంకటలక్ష్మి, దశమంతుల చిన్ని తదితరులు పాల్గొన్నారు.